

# పట్టుబట్టి.. కొలువు కొట్టి..

- కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లా వాసుల ప్రతిభ
- పెద్ద సంఖ్యలో ఎంపికైన యువత
- కోకల్‌దాస్ తండాలో ఒకే ఇంట్లో నలుగురికి జాబ్..
- షేకాపూర్‌లో ముగ్గురు అన్నదమ్ములు..
- రావుట్లలో భార్యాభర్తల ఎంపిక
- మొన్న జాబ్.. నిన్న పెండ్లి..
- తిమ్మారెడ్డి జంటకు తీపిగుర్తు



పెండ్లింట శుభవార్త..

## ఉద్యోగాలకు ఎంపికైన కొత్తజంట

ఎల్లారెడ్డి, అక్టోబర్ 5: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి సురేశ్‌కు నెలరోజుల క్రితం అచ్చయపల్లి గ్రామానికి చెందిన శిరీషతో వివాహం నిశ్చయమైంది. బుధవారం వచ్చిన కానిస్టేబుల్ ఫలితాల్లో కొత్తజంట పేర్లు ఉండడంతో ఇరు కుటుంబాలు సంతోషంలో మునిగితేలాయి. పెండ్లి పనుల్లో నిమగ్నమైన రెండు కుటుంబాలకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గురువారం సురేశ్-శిరీషల వివాహ కార్యక్రమంలో వధూవరులను ఆశీర్వదించేందుకు వచ్చిన బంధుమిత్రులు, స్నేహితులు ఔను...ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక్కటయ్యారని అనడంతో నవ్వులు విరబూశాయి. వివాహానికి వచ్చిన బంధుమిత్రులు పెండ్లి శుభాకాంక్షలతోపాటు ఉద్యోగ శుభాకాంక్షలు చెప్పడం అక్కడ విశేషంగా మారింది. ఇదిలా ఉండగా తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన చిలుక పవన్ కుమార్, గాలిపురం అశోక్ సైతం కానిస్టేబుల్‌కు ఎంపిక కావడంతో గ్రామంలో సంబురాలు నెలకొన్నాయి.

## ఒకే ఇంట్లో ముగ్గురికి...

మద్నూర్, అక్టోబర్ 5: పుట్టింది పేదింట్లోనే అయినప్పటికీ కష్టపడి చదివి పోలీసు కొలువులు సాధించారు ఈ ముగ్గురు అన్నదమ్ములు. మద్నూర్ మండలం శేఖాపూర్ గ్రామానికి చెందిన శంక్‌పాలే సురేశ్‌అనితలకు ముగ్గురు కుమారులు. సురేశ్ గ్రామంలో మేకల కాపరి, అనిత వ్యవసాయం చేస్తున్నది. వీరి కుమారులైన నితిన్, సతీశ్, సచిన్ ముగ్గురూ పోలీసు కొలువులు సాధించారు. బుధవారం వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో సతీశ్ సివిల్, సచిన్ ఏఆర్, నితిన్ టీఎస్‌ఎస్‌పీకి ఎంపికయ్యారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల, ఇంటర్ ఆదర్శ కళాశాలలోనే విద్యనభ్యసించడం విశేషం. ఒకే ఇంట్లో ముగ్గురికీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో గ్రామస్తులు సంబురాలు జరుపుకొన్నారు.



కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన నితిన్, సతీశ్, సచిన్

## కానిస్టేబుల్ అయిన పర్వతారోహకురాలు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 5: టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మాలోత్ రజిత కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యింది. లింగంపేట మండలం ఎక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్యానాయక్ తండాకు చెందిన కుబ్యా-జీరిల కూతురు రజిత. డిగ్రీ చదువుతున్న సమయంలోనే పర్వతారోహణ చేసింది. చదువులో ముందుండే రజిత కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికవ్వడంతో ఎంపీటీసీ విఠల్, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.



మాలోత్ రజిత



## ఒకే కుటుంబంలో నలుగురికి..

వర్ని, అక్టోబర్ 5: వర్ని మండలం కోకల్‌దాస్ తండాలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అభ్యర్థులకు ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు వర్ని మండలానికి చెందిన 12మంది ఎంపిక కాగా, అందులో కోకల్‌దాస్ తండాకు చెందిన నలుగురు ఉద్యోగాలు సాధించారు. కోకల్‌దాస్ తండాకు చెందిన గాజీరాం-భారతీబాయి కుమార్తె బర్దావల్ రాష్ట్రాబాయి, బర్దావల్ కొడుకులు మహిందర్, బర్దావల్ రాజేందర్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గాజీరాం సోదరుడు బీర్మల్-మధుబాయి సంతానమైన యశ్వంత్ కూడా కానిస్టేబుల్ కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

ఒకే కుటుంబం నుంచి ఎంపికైన అభ్యర్థులు

## రావుట్లలో భార్యాభర్తలకు.. మైలారంలో అన్నదమ్ములకు



సుమన్, సౌమ్య

సిరికొండ, అక్టోబర్ 5: సిరికొండ మండలం రావుట్లలో భార్యాభర్తలకు, మైలారంలో అన్నదమ్ములకు కానిస్టేబుల్ కొలువు వరించింది. మండలానికి చెందిన సుమారు 40మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కాగా, బాజిరెడ్డి కోచింగ్ సెంటర్‌లో చదివిన వారు సైతం ఉద్యోగాలు సాధించడం విశేషం. రావుట్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు సుమన్‌సౌమ్య.. బాజిరెడ్డి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొంది పోలీస్ జాబ్ సాధించారు. మైలారం గ్రామానికి చెందిన అన్నదమ్ములు బైరిగోని గిరిధర్, వాల్మీకి సివిల్స్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు.



గిరిధర్



వాల్మీకి

# తెలంగాణలోనే ఫుల్ కరెంట్

- దేశంలో ఉచిత కరెంటు ఇస్తున్నది మనరాష్ట్రమే..
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- సీఎం కేసీఆర్ ముందు చూపుతోనే విద్యుత్ కోతలు లేవు..
- ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలోనే కరెంట్ కోతలు
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన సభాపతి



బాన్సువాడ మండలం కొల్లూర్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను అందజేస్తున్న స్పీకర్ పోచారం, చిత్రంలో ట్రాన్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

బాన్సువాడ రూరల్/కోటగిరి, అక్టోబర్ 5: దేశంలో వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత ఉండేదని, కరెంటు కోసం రైతులు, ప్రజలు నిత్యం రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేసిన ఘటనలను గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే విద్యుత్ కోతలు లేవని కొనియాడారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో విద్యుత్ కొరత ఉన్నదని, పవర్ హాలీడే ప్రకటించినట్లు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, కోటగిరి మండలాల్లో స్పీకర్ పోచారం గురువారం పర్యటించారు. బాన్సువాడ మండలం కొల్లూర్‌లో రూ.100కోట్లతో ఏర్పాటు చేసిన 223/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో రూ.14కోట్లతో నిర్మించిన వెంకటాద్రి అతిథి గృహాన్ని ప్రారంభించారు. తాడ్కోల్ గ్రామంలో రూ.48లక్షలతో నిర్మించిన రెడ్డి సంఘ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కోటగిరి మండల కేంద్రంలో రూ.20కోట్లతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఆయా చోట్ల బతుకమ్మ చీరెలు, గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వేర్వేరు చోట్ల నిర్వహించిన సభల్లో స్పీకర్ పోచారం మాట్లాడారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో వ్యవహరించి రూ.96,500 కోట్లు ఖర్చు చేసి విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి దేశంలోనే 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దారన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నదన్నారు. రాష్ట్ర విభజన కింద తెలంగాణకు 7780 మెగావాట్ల విద్యుత్ వచ్చిందని, సీఎం కేసీఆర్ ముందుచూపు, సీఎండీ ప్రభాకర్‌రావు చొరవతో నేడు 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్నామని చెప్పారు. వేసవికాలంలో నిమిషం కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. విద్యుత్ కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడంతో తాను బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు చేరుకోవాలంటే దాదాపు 10 గంటలు పట్టేదని గుర్తుచేశారు. చాలీచాలని విద్యుత్ సరఫరాతో పంటలు ఎండి రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడేవారని ఆవేదన వ్యక్తంచేశారు. నేడు ధర్నాలు, రాస్తారోకోలు ఎక్కడా లేవన్నారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు భవిష్యత్‌లో విద్యుత్ కోతల బారినపడకుండా ఉండేందుకు 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేశానన్నారు. ఈ సబ్ స్టేషన్‌తో బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలతోపాటు కొద్దిమేర ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు 60ఏండ్ల పాటు విద్యుత్ సమస్య లేకుండా ఉంటుందని స్పీకర్ తెలిపారు. నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ కృషితో కాళేశ్వరం నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చానని తెలిపారు. భవిష్యత్‌లో నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు సాగునీటికి ఢోకా ఉండదని భరోసా ఇచ్చారు. పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.



కోటగిరిలో గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

## సీఎం కేసీఆర్ కృషితో వెలుగులు..

### ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు

సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. నాడు కరెంట్ లేకుంటే పేపర్లో వార్త...నేడు కరెంట్‌తో ఉంటే వార్త అని చమత్కరించారు. సీఎం సహకారంతో, సిబ్బంది కృషితో రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి సహకారం, స్పీకర్ చొరవతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విద్యుత్ సమస్యలు తీర్చేందుకు దాదాపు రూ.1500 నుంచి రూ. 2వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రైతుబిడ్డగా, రైతుల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి అని, ఇలాంటి నాయకుడు నియోజకవర్గ ప్రజలకు ఉండడం అదృష్టమన్నారు. భవిష్యత్ తరాల ప్రజలు, రైతులకు మేలు కోసం 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకు స్పీకర్ పోచారం చేసిన కృషిని కొనియాడారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఏండ్ల తరబడి రైతులకు, ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా ఉంటుందని చెప్పారు. విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి కామారెడ్డి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, కోటగిరి మండలాల ఎంపీపీలు, సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 'హోంమంత్రి అవుతారు సార్..'

### - స్పీకర్‌తో మాటామంతిలో మున్నూరుకాపులు

బాన్సువాడ, అక్టోబర్ 5: 'ఈసారి భారీ మెజారిటీతో గెలిచి హోంమంత్రి అవుతారు సార్' అంటూ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వద్ద నియోజకవర్గానికి చెందిన మున్నూరుకాపులు మనోగతాన్ని వెల్లడించారు. గురువారం మున్నూరు కాపు సంఘ భవనానికి భూమిపూజ చేసేందుకు వచ్చిన స్పీకర్ పోచారం కాసేపు వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా హోంమంత్రి అవుతారు సారని చెప్పగా.. తెలంగాణ వచ్చిన తర్వాత తొలి వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశానని, ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్నానని, ఇంతకు మించి పదవులు నాకొద్దని స్పీకర్ పోచారం అన్నారు. తాను చాలాసార్లు మంత్రి పదవులు చేశాని, కానీ స్పీకర్ పదవి అత్యున్నత స్థానం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంలో చాలా మంది మంత్రులు ఉంటారు, కానీ స్పీకర్ ఒక్కరే ఉంటారని చెప్పారు.

## స్వరాష్ట్రంలోనే కులవృత్తులకు పూర్వవైభవం

- రాష్ట్రంలో అన్నివర్గాలకూ న్యాయం
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- సుద్దులంలో రూ.6.55 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

డిచ్‌పల్లి, అక్టోబర్ 5 : అభివృద్ధి చేసేది ఎవరో.. మాయమాటలు చెప్పేది ఎవరో ప్రజలు గమనించాలని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని సుద్దులం గ్రామంలో రూ.6.65 కోట్ల అభివృద్ధి పనులను, గ్రామంలో ఏర్పాటు చేసిన జయశంకర్‌సార్ కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. గ్రామంలో 32 మందికి మంజూరైన గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. యువకులకు క్రీడా కిట్లను, మహిళలకు బతుకమ్మ చీరలనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు వారికీ న్యాయం జరుగుతున్నదన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలతో చెరువులు, కుంటలను మరమ్మతు చేసుకున్నామని.. కులవృత్తులకు పూర్వవైభవం వచ్చిందన్నారు. తెలంగాణ వస్తే ఏమొస్తది అన్న దానికి నిదర్శనం ఈ సంక్షేమ కార్యక్రమాలేనన్నారు. తెలంగాణ వ్యతిరేకి మోదీ అని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు లేవన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి తెలంగాణ ప్రజలు ముఖ్యంగా రూరల్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇటీవల జిల్లాకు వచ్చిన మోదీ తన హోదాను మరిచి సీఎం కేసీఆర్‌పై చేసిన విమర్శలు చూసి ప్రజలు నవ్వుకున్నారని అన్నారు. కేటీఆర్‌ను సీఎం చేయలంటే మోదీ సహకారం ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అప్రమత్తగా ఉండాలని, అభివృద్ధి చేసే వారెవరో మాటలు చెప్పే వారెవరో ప్రజలు గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీ గౌడ్, జడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు గ్రామప్రజలు మహిళలు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి మండలం సుద్దులంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

## కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యం

- ఎమ్మెల్యే మహ్మద్ షకీల్
- నవీపేటలో రూ.5.85 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

నవీపేట,అక్టోబర్ 5: దేశంలోనే ప్రగతి పథంలో దూసుకుపోతున్న తెలంగాణలో అభివృద్ధి జరగలేదంటూ పిచ్చికూతలు కూస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఏ పాటి అభివృద్ధి జరిగిందో నిరూపించాలని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సవాల్ విసిరారు. మండలంలోని అభంగపట్నం, మద్దెపల్లి, జన్నేపల్లి, నవీపేట తదితర గ్రామాల్లో రూ.5.85 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలు బీఆర్‌ఎస్ సర్కార్‌పై బురదజల్లే కుట్రలు చేస్తున్నాయన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతూ సీఎం కేసీఆర్‌ను తిడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు బేషరతుగా ఆయా గ్రామ కమిటీలకు వారు తీసుకున్న సొమ్మును వాపస్ ఇవ్వాలని షకీల్ సవాల్ చేశారు. పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలో తాను ఇటీవల పర్యటించినప్పుడు అక్కడి ప్రజల బాధలు వర్ణనాతీతమని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు, రైతు బీమా, గిట్టుబాటు ధర, ఆసరా పింఛన్లు, సాగునీరు తదితర పథకాలు అందక మరాఠా ప్రజల కండ్లలతో నీరు రాక రక్తం వస్తున్నదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు. అక్కడ బీజేపీ అధికారంలో ఉన్నదన్నారు. తెలంగాణలో అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. 60 ఏండ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏపాటి అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే షకీల్ ప్రశ్నించారు. తెలంగాణలో మరోసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ బఫర్ పార్టీల మోస పూరిత మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఐదేండ్లపాటు భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి అభంగపట్నం ఎర్రకుంట మినీప్రాజెక్టు పనులను పూర్తి చేయలేదని, త్వరలోనే సీడీపీ నిధులను వెచ్చించి ఎర్రకుంట పెండింగ్ పనులను పూర్తిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ నీరడి సవితాబుచ్చన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు,వైస్ ఎంపీపీ హరిశ్, నవీపేట సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు తెడ్డు పోశెట్టి, నవీపేట సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు న్యాలకంటి అబ్బన్న, దొంత ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మద్దెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్